బిజెపికి ఓట్లు అడిగే అర్హత ఎక్కడిది ?

- బిడి కార్మికులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- మాయమాటలు నమ్మి ఆగం కావొద్దు
- అన్ని కులాలు, మతాలు కలిసి ముందుకు సాగాలి
- ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ ప్రభుత్వం అన్నింటినీ ప్రయివేటు పరం చేస్తోందని, రాష్ట్రానికి రావాల్సిన రూ.25వేల కోట్ల నిధులు ఇవ్వలేదని, 33 జిల్లాల్లో ఒక్క మెడికల్ కళాశాల, నవోదయ స్కూల్ ఇవ్వలేదని, ఇక ఏం ముఖం పెట్టుకొని బిజెపి ఓట్లు అడుగుతుందని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీకి రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత లేదని వ్యాఖ్యానించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. దళితుల అభివృద్ధి గురించి ఆలోచించి ఉంటే వారికి ఈ పరిస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మిమోసపోద్దని, ఆయా పార్టీల చరిత్ర చూసి ఓటేయ్యాలని కోరారు. శుక్రవారం ముధోల్, కోరుట్ల, ఆర్మూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ పాల్గొని మాట్లాడారు. భైంసా అంటేనే అన్ని అబద్ధాలు చెప్పారని, ఇక్కడ హిందూ, ముస్లింలు ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడిచిపోయినా ఎన్నికలు రాగానే అబద్దాలు, అబండాలు సహజమైపోయాయని, ప్రజాస్వామానికి ఇంకా పరిణతి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుబంధు దుబారా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతుండగా.. మూడు గంటలు కరెంటు చాలు అని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఇది సరైన పద్ధతేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనున్న మహారాష్ట్ర రైతులు ఇక్కడ బోర్లు వేసి అక్కడ పంటలు పండిస్తున్నారు. అక్కడి కంటే ఇక్కడి రోడ్ల పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ఆగమాగం ఉండేదని, వ్యవసాయ స్థిరీకరణ చేయాలని నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తామని చెబుతున్నారని, ఈ పోర్టల్ లేకపోతే మళ్లీ దళారుల రాజ్యం వస్తుందని చెప్పారు. గతంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు ద్వారా 4వేల ఎకరాలకు నీరందించేవారని, ఇప్పుడు 12వేల ఎకరాలకు సాగునీరందుతోందని తెలిపారు. రైతుబంధు సాయంతో రైతులు అప్పులు తీర్చుకుంటున్నారని, కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాలు పోలీస్‌స్టేషన్‌లో లభించేవని, ఇప్పుడా పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎలాంటి కర్ఫ్యూ, కరువు లేకుండా కులం, మతం అన్న భేదం లేకుండా అందరూ సమానంగా బతుకుతున్నారని తెలిపారు. బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. సభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపి దామోదర్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపి గోడం నగేష్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, డా.రమాదేవి పాల్గొన్నారు.

బిడి కార్మికుల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

బిడి కార్మికులకు ఏ రాష్ట్రంలో కూడా పెన్షన్ ఇవ్వడం లేదని, తెలంగాణ మాత్రమే పెన్షన్ ఇస్తున్నట్టు తెలిపారు. గత పాలనలో కోరుట్ల, సిరిసిల్ల, పోచంపల్లిలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉండేవని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కార్మికులకు సబ్సిడీలు ఇస్తూ వారికి భరోసా కల్పించామని గుర్తు చేశారు. ధరణి ఆధారంగానే రైతుబంధు, రైతుబీమా అందిస్తున్నామని, ధరణి లేకుంటే అవి ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. ధరణి ఉండాలంటే బిఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ ఇవ్వదు.. ఇస్తే కండ్లమంట

దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం మేలు చేసిందని సిఎం కెసిఆర్ ప్రశ్నించారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదంటున్న ఇలాంటి పార్టీ మనకు అవసరమా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలోకి రాకముందు, వచ్చాక చేసిన అభివృద్ధి ప్రజలకు కండ్లముందే కనబడుతుందని, నా బావ చెప్పిండు.. బంధువు చెప్పిండని కాకుండా.. ఆలోచన చేసి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఆదాయం పెరిగేకొద్దీ సంక్షేమ పథకాలు పెంచుతున్నామని చెప్పారు. తెలంగాణ కోసమే బిఆర్ఎస్ పుట్టిందన్న కెసిఆర్.. ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

తెలంగాణ ద్రోహులందరూ జతకట్టిండ్రు

- ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలంగాణ ద్రోహి
- ఎన్నికల ప్రచార సభలో మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన వ్యక్తి రేవంత్‌రెడ్డి ఓ క్రిమినల్ గ్యాంగ్ అని, చంచల్‌గూడ జైల్లో 1779 నెంబర్ ఖైదీ బెయిల్ మీద తిరుగుతున్నాడని మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం సంగారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం సాధించి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేసిన కెసిఆర్ లాంటి స్ట్రాంగ్ లీడర్ ఉండగా.. మనకు రాంగ్ లీడర్లు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహులంతా జతకట్టి ఎన్నికల ముసుగులో మన దగ్గరికి వస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ గెలవాలంటే కారు గుర్తుకు ఓటేయాలని, తెలంగాణ ఓడాలంటే రేవంత్‌రెడ్డి క్రిమినల్ గ్యాంగ్‌కు ఓటేయాలన్నారు. ఏది కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఈ సారి ఎన్నికల్లో తెలంగాణలో టిడిపి అసలు పోటీయే చేయడంలేదని, షర్మిల కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని, ఇక పవన్ కల్యాణ్ బిజెపితో చేతులు కలుపుతున్నారని తెలిపారు. అనాడు సంగారెడ్డిని కర్ణాటకలో కలపాలని డిమాండ్ చేసిన స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. బిఆర్ఎస్ గెలిస్తే సంగారెడ్డి నియోజకవర్గంలో 10 వేల ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో బిఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

నామినేషన్ల పర్వం షురూ

- తొలి రోజు తుమ్మల, రేవంత్‌రెడ్డి సహా పలువురు దాఖలు
- ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మొదటి రోజు శుక్రవారం నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పలువురు నామినేషన్లు వేశారు. వీరిలో కాంగ్రెస్ నుంచి నియోజకవర్గం నుంచి టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తరపున మాజీ ఎమెల్యే గురునాథ్‌రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్ల కేంద్రాల వద్ద సీఆర్పీఎఫ్ బలగాలతో పాటు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నామినేషన్లు వేసే అభ్యర్థులతో పాటు ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యా యి. నిర్మల్ నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ముధోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్, బెల్లంపల్లిలో బిజెపి అభ్యర్థి అమురాజుల శ్రీదేవి నామినేషన్ దాఖలు చేశారు. చెన్నూర్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి సోగాల సంజీవ్, సిర్పూర్(టి) నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ నామినేషన్ పత్రాలు అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గం లో ఆజాద్ అధికార సేన పార్టీ బలపరుస్తున్న ఇమంది ఉదయ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా పసుపులేటి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటి రోజు 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రంగారెడ్డిలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వికారాబాద్ జిల్లాలో ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువగా నామినేషన్లు దాఖలు చేశారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్‌గౌడ్ నామినేషన్లు వేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ తూర్పులో బిజెపి అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నామినేషన్ వేశారు. బిఆర్ఎస్ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. బిజెపి పార్టీ తరుపున భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చందుపట్ల కీర్తిరెడ్డి నామినేషన్ దాఖలు వేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్య నారాయణరావు తరపున ఆయన భార్య గణపురం జడ్పిటిసి గండ్ర పద్మ నామినేషన్ దాఖలు చేశారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎంసిపిఐ(యు) అభ్యర్థి పెద్దారపు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 15 నామినేషన్లు దాఖలు అయినట్టు రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

‘మల్కాజిగిరి’ చాలా హాటు గురూ!

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బిఆర్ఎస్, కాంగ్రెస్
- ప్రచారంలోకి అగ్రనేతలు
- త్వరలో రాహుల్‌గాంధీ రోడ్ షో
- మైనంపల్లికే మద్దతంటున్న ఓటర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాల్లో మల్కాజిగిరి నియోజకవర్గం హాట్ టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బిఆర్ఎస్ అధి నాయకత్వాన్నే తిరుగుబాటు జెండా ఎగరేసి కాంగ్రెస్ పార్టీ నుంచి బి ఫారం తెచ్చుకున్నారు. ఈ స్థానాన్ని బిఆర్ఎస్ పార్టీ కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మల్కాజ్‌గిరి చాలా హాటు గురూ..అంటే సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. బిఆర్ఎస్ నుంచి మంత్రి మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ సిట్టింగ్ కార్పొరేటర్ బిజెపికి చెందినవారు కావడంతో ఎంతోకొంత లబ్దిపొందాలని ఆపార్టీ కూడా ప్రయత్నిస్తోంది. సిట్టింగ్ ఎంపి రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షుడు కావడంతో ఖచ్చితంగా ఇక్కడ కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ఆయన గట్టి పట్టుదలతో ఉన్నారు. రెండు ప్రధాన పార్టీలు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మల్కాజిగిరి ఘాటెక్కింది. ఇరు పార్టీల అభ్యర్థులూ నిత్యం మాటల తూటాలతో ప్రజల్లో ఉంటున్నారు. ఇప్పటికే మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. త్వరలో ఎమ్మెల్సీ కవిత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రోడ్ షోలు కూడా ఉన్నట్టు సమాచారం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజకీయం మొత్తం మల్కాజిగిరి నియోజకవర్గం చుట్టే తిరుగుతోంది. గడిచిన రెండు నెలల కాలంలో ఈ నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంత్రి హరీశ్‌రావుపై హాట్ కామెంట్స్ చేయడం, ఆ తర్వాత పార్టీ మారడంతో ‘మల్కాజిగిరి’ రాజకీయంలో వేగంగా మార్పులు చోటు చేసుకున్నాయి. మరోవైపు నియోజకవర్గంలో పాగా వేసేందుకు మంత్రి మల్లారెడ్డి ఐదేండ్లుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు అవకాశం రావడంతో తన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డిని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిపి పంతం నెగ్గించుకునేందుకు మంత్రి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. మైనంపల్లి సైతం మరోసారి గెలుపు కోసం కష్టపడుతున్నారు. దాంతో ఇప్పుడు మల్కాజిగిరి రాజకీయం ‘మల్లారెడ్డి వర్సెస్ మైనంపల్లి’ గా మారింది. ఐదేండ్లుగా మైనంపల్లి, మల్లారెడ్డి మధ్య గ్యాప్ ఉన్నా, పెద్దగా కనిపించలేదు. రాను రాను ఈ గ్యాప్ ముదిరి ఒకరిపై మరొకరు బహిరంగ విమర్శలు చేసుకునే స్థాయికి చేరుకున్నది. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ ఇద్దరు నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో గడిచిన రెండు నెలలుగా ఈ ఇద్దరు నేతల మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉన్నాయి. మైనంపల్లి మామ, అల్లుడిపై విమర్శలు చేస్తుంటే, మంత్రి మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు మైనంపల్లిపై అదే స్థాయిలో విరుచుకుపడుతున్నారు.

త్వరలో అగ్ర నేతల పర్యటనలు

మల్కాజిగిరి నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే దాదాపు నియోజకవర్గం మొత్తం ఒక రౌండ్ ప్రచారం పూర్తి చేశారు. అయినా అక్కడక్కడ ప్రతికూల వాతావరణ పరిస్థితులు కనిపిస్తుండటంతో ఇరు పార్టీల అగ్ర నేతలను రంగంలోకి దించి తమ బలాబలాలను నిరూపించుకునేందుకు ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులూ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రెండు రోజుల క్రితం మంత్రి హరీశ్‌రావు బిఆర్ఎస్ నియోజవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ‘మల్కాజిగిరి’ని దత్తత తీసుకుంటా అని హామీనివ్వడంతోపాటు మర్రి రాజశేఖర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించి వెళ్లారు. త్వరలో ఎమ్మెల్సీ కవిత రోడ్ షో నిర్వహించేందుకు బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారు. నేరెడ్‌మెట్, ఆనంద్‌బాగ్, అనుటెక్స్ లాంటి ప్రధాన కూడళ్లలో రోడ్ షోలో భాగంగా ఎమ్మెల్సీ కవితతో మాట్లాడించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ సైతం బిఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు ప్లాన్ చేస్తోంది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో నియోజకవర్గంలో రోడ్ షో లేదా భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆరు గ్యారంటీలపై నియోజకవర్గం ప్రజలకు నమ్మకం కలిగించేలా స్పీచ్ ఇప్పించనున్నారు. ఆ తర్వాత టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డితోపాటు మరికొందరు నేతలతో కూడా సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ అగ్ర నేతల పర్యటనలు ఈ వారం రోజుల్లోపు పూర్తయ్యేలా ఇరు పార్టీల అభ్యర్థులూ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచిన మల్కాజిగిరి నియోజకవర్గంలో అగ్ర నేతల రాకతో రాజకీయ సమీకరణాలు మరింత మారనున్నాయి.

ఎంఐఎం తొలి జాబితా విడుదల

- తొమ్మిది స్థానాల్లో పోటీకి నిర్ణయం
- ఇద్దరు సిట్టింగ్‌లకు మొండి చెయ్యి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను ఎంఐఎం విడుదల చేసింది. శుక్రవారం దారుసలాంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసి ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం తొమ్మిది స్థానాల్లో పోటీ చేస్తున్నామని, సిట్టింగ్ స్థానమైన అయిన బహదూర్ పురాతో పాటు రాజేంద్ర నగర్, జూబ్లీహిల్స్ స్థానాల్లో అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. పోటీ చేస్తున్న తొమ్మిది నియోజక వర్గాల్లో ఎంఐఎంకు పట్టం కట్టాలని ఆయన ఓటర్లను కోరారు. కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని,మరోసారి తెలంగాణలో ఎవ్వరి మద్దతు లేకుండా బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నప్పటికి రాజేంద్రనగర్‌లో ప్రకాష్ గౌడ్ జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్‌లను ఓడగొడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటోందని విమర్శించారు. బిజెపి బిసి ముఖ్యమంత్రి ప్రకటన పెద్ద జోక్ అని కొట్టి పారేసారు. బాబ్రీ మసీద్ కూల్చివేత పాపంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పాత్ర కూడా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆరే నిజమైన సెక్యులర్ వాది అని కితాబునిచ్చారు. సెక్రటేరియట్‌లో కూల్చిన మసీద్‌ను కెసిఆర్ సర్కార్ కొత్తగా నిర్మించి ముస్లింల మనోభావాలను కాపాడిందని గుర్తు చేశారు.

ఇద్దరు సిట్టింగ్‌లకు మొండి చెయ్యి

ఎంఐఎం పార్టీ 2018లో పాగా వేసిన ఎడు సిట్టింగ్ స్థానాల్లో శుక్రవారం ఆరు స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండి చెయ్యిచ్చింది. చార్మినార్ నుంచి గెలిచిన ముంతాజ్ ఖాన్, యాకత్ పురా నుంచి గెలిచిన పాషా ఖాద్రిలను వయోభారం దృష్ట్యా తప్పిస్తామని గతంలోనే ఎంఐఎం ప్రకటించింది. ఆ స్థానాల్లో మాజీ మేయర్లు మాజిద్ హుస్సేన్, జుల్ఫికర్ అలీ అహ్మద్‌కు చార్మినార్ టికెట్ కేటాయించారు. సెకండ్ లిస్టులో ఓవైసీ కుటుంబం నుంచి ఒకరికి అవకాశం కల్పించేందుకే మరో సిట్టింగ్ స్థానమైన బహదూర్ పుర టికెట్‌ను ఆపినట్టు తెలుస్తోంది.

ప్రకటించిన అభ్యర్థుల వివరాలు

1). చార్మినార్- జుల్ఫేఖర్ అహ్మద్ 2). చాంద్రాయణ గుట్ట - అక్బరుద్దీన్ ఓవైసీ 3). మలక్ పేట్ - అహ్మద్ బలాల 4). నాంపల్లి - మాజిద్ హుస్సేన్ 5). కార్వాన్ - కౌజర్ మోహినుద్దిన్ 6). యాకత్ పుర - జాఫర్ హుస్సేన్ మీరజ్

యుఎఇకి లీ ఫార్మా కీళ్ల వ్యాధి ఔషదాలు

హైదరాబాద్ : ఔషద ఉత్పత్తుల కంపెనీ లీ ఫార్మా ఉత్పత్తి చేసే కీళ్ల వ్యాధి చికిత్సలో వాడే బయో కార్టిలేజ్ స్మూత్‌వాక్ టాబ్లెట్లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి ఎగుమతి చేయనున్నట్లు వెల్లడించింది. ఆ ప్రాంతంలో మార్కెట్ చేయడానికి అక్కడి మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ప్రివెన్షన్ నుంచి అనుమతులు పొందినట్లు తెలిపింది. “లీ ఫార్మా చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలవనుంది. భారత్‌లో తయారైన ఇటువంటి ఉత్పాదనకు యుఎఇలో ఆమోదం రావడం ఇదే మొదటిసారి. ఈ ఉత్పత్తిని అన్ని మధ్యప్రాచ్యం, తూర్పు ఆసియా దేశాలలో విక్రయించేందుకు కంపెనీ దరఖాస్తు చేసుకుంది. అలాగే మార్కెటింగ్ ఆథరైజేషన్ కోసం యుఎస్ ప్రభుత్వానికి 2024 మూడవ త్రైమాసికంలో దరఖాస్తు చేస్తాము.” అని లీ ఫార్మా డైరెక్టర్ లీలా రాణి తెలిపారు. శక్తివంతమైన ఫైటో పోషకాలతో సహజ బయోన్యూట్రాస్యూటికల్స్ ఆధారంగా ఈ ట్యాబ్లెట్లను తయారు చేసినట్లు వెల్లడించారు. మదులాస్థిని (కార్టిలేజ్) పెంచి కీళ్లలో కణజాల రుగ్మతలపై ఇది చక్కగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ మందు వాడితే సర్జరీలను నివారించవచ్చని లీలా రాణి అన్నారు. దేశీయంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ ఔషదాలు లభ్యం అవుతాయని తెలిపారు.

జైలుకు క్రిప్టో ఎక్స్ఛేంజి వ్యవస్థాపకుడు

- రూ.80 వేల కోట్ల మోసం కేసులో న్యూయార్క్ కోర్టు శిక్ష

న్యూయార్క్ : క్రిప్టో ఎక్స్ఛేంజి ఎఫ్‌టిఎక్స్ ఫౌండర్, సిఇఒ శామ్ బాంక్‌మన్‌ను న్యూయార్క్ కోర్టు దోషిగా తేల్చింది. ఆర్థిక మోసాలు, అక్రమ నగదు చలామణి వంటి నేరాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. క్రిప్టో కరెన్సీ పరిశ్రమలో శామ్‌ను కింగ్‌గా భావిస్తారు. గురువారం న్యూయార్క్ కోర్టు ఇచ్చిన తీర్పుతో 31 ఏళ్ల శామ్ బాంక్‌మన్ ప్రతిష్ట మొత్తం పోయింది. శామ్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. క్రిప్టో ప్రారంభించిన అనతికాలంలోనే ఆయన సంపద 26 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.2 లక్షల కోట్లకు) ఎగిసింది. నిధుల దుర్వినియోగం, కృత్రిమ క్రిప్టో ధరలు, మనీలాండరింగ్ తదితర అక్రమాలకు పాల్పడిందనేది ప్రధాన అరోపణ. తమసంస్థ దివాలా తీసినట్లు ఎఫ్‌టిఎక్స్ గతేడాది నవంబర్‌లో ప్రకటించింది. దీనిపై విచారించిన న్యూయార్క్ కోర్టు 10 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.80వేల కోట్ల) విలువైన ఆర్థిక నేరానికి పాల్పడినట్లు తేల్చింది. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక మోసాల్లో ఒకటని కోర్టు పేర్కొంది. బ్యాంక్‌మన్‌తో పాటు మరో ముగ్గురు తమ తప్పులను కోర్టు ముందు అంగీకరించడంతో వారిని దోషిగా తేల్చింది.

కెసిఆర్ పాలన కలల ప్రపంచాన్ని సృష్టించింది

- మోసపూరిత మాటలకు దళిత, గిరిజనులు ఆత్మహత్యలు
- సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల కెసిఆర్ పాలన కలల ప్రపంచాన్ని సృష్టించిందని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. ఆయన మోసపూరిత మాటలను నమ్మి దళిత, గిరిజనులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బలహీన వర్గాల ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 92శాతం మంది దళిత, గిరిజన, మైనారిటీ బలహీన వర్గాలున్నాయని చెప్పారు. రాష్ట్రానికి మీరు ముఖ్యమంత్రి కావడానికి మొదటి దళిత ముఖ్యమంత్రి అంటూ కలల ప్రపంచం చూపించారని ఎద్దేవా చేశారు. ‘దళితులకు మూడెకరాలు. దళిత బంధు అన్నారు. బడ్జెట్‌లో రూ.17,700 కోట్ల లెక్కలు చూపించారు. కనీసం రూ. 300 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఆదిలాబాద్ జిల్లాలో రమాకాంత్ బోనాథ్‌కు దళిత బంధు రాక ఆత్మహత్య చేసుకున్నాడు. నా ఆత్మహత్య మీరే కారణామంటూ లేఖ రాసి చనిపోయారు. రాజ్యాధికారం కోసం ఎన్ని లక్షల మంది జీవితాలతో ఆడుకుంటారు’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ కోసం కన్న కలలు నేరవేరలేదన్నారు. కాంగ్రెస్ మాత్రమే మీ కలలు నిజం చేస్తుందన్నారు. దొరల తెలంగాణ పోయి ప్రజల తెలంగాణ తీసుకోస్తామని రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దని దళిత, గిరిజన కుటుంబాలకు విజ్ఞప్తి చేశారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. మీకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సూసైడ్ నోట్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, కొడుకు, కూతురు, అల్లుడు రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వామపక్షాలతో చర్చించామన్నారు. పొత్తుల అంశం జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌కు షర్మిల మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్ఆర్ కూతురుగా కాంగ్రెస్‌కు నష్టం జరగకూడదనే ఆమె నిర్ణయం స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో భావస్వరూపత గల పార్టీలతో చర్చలు జరుగుతుంటాయన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ పోటీ చేయాలనేది ఎంఐఎం నేత అసదుద్దీన్‌కు అనవసరమన్నారు. అది తమ పార్టీ నిర్ణయిస్తుందన్నారు.

లెఫ్ట్ మ్యానిఫెస్టోల్లో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం కృషి చేస్తామని సిపిఎం, సిపిఐలు హామీ ఇచ్చాయి. ఈ మేరకు శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డిలను డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డిజెహెచ్ఎస్) అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, ట్రెజరర్ చిలుకూరు అయ్యప్ప, డైరెక్టర్లు దండ రామకృష్ణ, డేగ కుమార్ తదితరులు ఆ పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లో వారిని వేరువేరుగా కలిశారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంలో తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తమ్మినేని, కూనంనేని తెలిపారు.

ప్రలోభాలను కట్టడి చేయడమే లక్ష్యం

- రాష్ట్రానికి 375 కంపెనీల కేంద్ర బలగాలు
- రైతుబంధు అమలుపై ప్రభుత్వం నుంచి విజ్ఞప్తి రాలేదు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుబంధు అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్నికల కమిషన్‌కు ఎటువంటి విజ్ఞప్తి రాలేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆయన శుక్రవారం బిఆర్‌కెఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నోటిఫికేషన్ల జారీతో తెలంగాణలో నామినేషన్ల దాఖలు ప్రారంభమైందన్నారు. నవంబర్ 30వ తేదీన 13 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకు, మిగతా చోట్ల 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఆదివారం మినహా మిగతా రోజుల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు వికాస్‌రాజ్ వెల్లడించారు. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయొచ్చని.. డిపాజిట్ మాత్రం ఒక్కదానికే చెల్లించాలన్నారు. అఫిడవిట్‌లో అన్ని కాలమ్స్ తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. అక్టోబరు 31వ తేదీ వరకు వచ్చిన ఓటు హక్కు దరఖాస్తులను నవంబరు 10వ తేదీ వరకు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఓటరు స్లిప్పులు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు వికాస్ రాజ్ వెల్లడించారు.ఇప్పటి వరకు 137 కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు అయ్యాయి. 13 బిఆర్ఎస్, 16 కాంగ్రెస్, 5 బిజెపి, 3 బిఎస్‌పికి సంబంధించి అనుమానిత కేసులు ఉన్నాయని వివరించారు. ఎన్నికల్లో ప్రలోభాలను కట్టడి చేయాలన్నదే ఇసి లక్ష్యమన్నారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఆయా విభాగాలు చర్యలు తీసుకుంటు న్నాయని తెలిపారు. 375 కంపెనీలకు చెందిన కేంద్ర బలగాలు రాష్ట్రానికి త్వరలో రానున్నాయని చెప్పారు. నవంబర్ 2వ తేదీ నాటికి ఓటర్ల సంఖ్య 3,21,88,753గా ఉందని తెలిపారు. దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి ఘటనలో పోలీసుల నివేదిక వచ్చిందన్నారు. అభ్యర్థుల భద్రతపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు సిఇఒ వికాస్‌రాజ్ వెల్లడించారు.

మళ్లీ అధికారం బిఆర్ఎస్‌దే

- హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కెసిఆర్ : మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ బంపర్ మెజార్టీతో అధికారం చేపడుతుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో తాము చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్ని కుయుక్తులు చేసినా 78 స్థానాల్లో విజయం సాధించడం ద్వారా కెసిఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించనున్నారని తెలిపారు. రైతుబంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి,ఆసరా పెన్షన్లు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ తదితర సంక్షేమ పథకాలు చరిత్రలో నిలుస్తాయని అన్నారు. తాము మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల నాటకం ఆడుతోందని విమర్శించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు అనేక అభివృద్ధి పనులు చేసామని అన్నారు. తెలంగాణ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం కల్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF THE XXII JR. CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O. S. No: 2620 of 2019

Between:
Union Bank of India,
SME- S. R. Nagar Branch,
Hyderabad. **... Plaintiff**

A N D

To,
Mr. B. Chandra Mohan.
S/o: B. Pentaiah,
Ocp: Business
R/o: H. No: 7-1-30/1/14/23/B,
Subhash Nagar,
Sanathnagar,
Hyderabad-18. **... Defendant**

Please take notice that the Plaintiff Bank filed above suit against defendant for recovery of money a sum of **Rs. 2.14.695/-,** along with future interest and costs of the suit, the above said case stands posted for appearance of defendant. Therefore you are requested to appear before the Hon’ble XXII Jr Civil Judge, City Civil Court at Hyderabad on: 28-11-2023, at 10.30. A. M., in person or through an Advocate failing which the case will be heard and decided in your absence.

BY ORDER OF THE COURT

M/s. Vijaya Kumar Kamalapuri
Ch. Dayakar Rao
Advocates
Flat No: 102 # 6-1-307,
Sadaf Residency, Venkatapuram
Colony Padmnarao Nagar,
Secunderabad- 500025.
Cell. No: 94412 00122

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

- టిఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్
- ఎఐఎస్‌జిఇఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేయాల్సిందేనని టిఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఎఐఎస్‌జిఇఎఫ్) పిలుపు మేరకు శుక్రవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో చేతావనీ ర్యాలీ నిర్వహించారు. టిఎన్‌జిఒ నుంచి సుమారు వంద మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, టిఎన్‌జిఒ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జమ అయిన సొమ్మును రాష్ట్రాలకు ఇప్పించాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలనీ, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో ఉద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, కోశాధికారి ఆర్ శ్రీనివాసరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ, నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిలు, నరేందర్, ఆకుల రాజేందర్, సోమన్న, ఖాజా షరీఫ్, శ్రీనివాస్,కొండల్‌రెడ్డి,నరసింహ రెడ్డి, గోవర్దన్ రెడ్డి, పర్వతాలు, చారి తదితరులు పాల్గొన్నారు

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
Andhra Corporation

MLA Colony Branch Venkateshwara Co-op Housing Societys Shopping Complex Road No 12,Banjara HillsHyderabad 500034 (T. S) **7386618852**

GOLD JEWELS PUBLIC AUCTION NOTICE

The following borrower has availed Jewel/Gold Loan and failed to redeem the same within the stipulated time inspite of notices. If the borrower fails to redeem the pledged jewels on or before **09-11-2023** the same will be sold in public auction at 3 PM on **09-11-2023**, at our branch premises. Those who are willing to participate in public auction have to pay **INR 13500/-** as Earnest Money Deposit (EMD) being 10% of the gold appraised amount of INR 13500/- only

Sl No	Date of loan	Loan account number	Name and address of the borrower	Gross Weight	Net Weight	Outstanding Loan Amount As On 02-11-2023	Reserve Price	EMD
01	21-10-2021	161216630000008	Nidhigarg	50.5 Grams	39.00 Grams	Rs. 1,33,550/-	Rs. 1,35,000/-	Rs. 13,500/-

Terms and conditions:1) The registered notices were not responded by the borrower or returned undelivered , **2)** This public notice applies to the legal heirs of the deceased borrower, if any. **3)** EMD payment will be received up to 2:00 PM only towards Earnest Money Deposit, **4)** Successful bidders have to pay the entire bid amount on the spot immediately. The EMD is refundable on the same day up to 4:00 PM, **5)** Ornaments will be available for inspection at the time of auction only, **6)** The Authorized Officer has the authority to accept, reject, cancel, or postpone the auction process without assigning any reasons thereon, **7)** Bidders should submit the KYC proofs before participating in the auction, **8)** The jewels will be auctioned under the terms “as is where is” condition and at the sole risk and responsibility of the bidder. For further details contact the Branch Manager at the above address.

Date: 03-11-2023 **Sd/-Branch Manager,**

ధాన్యం కొనుగోలు ఇంకెప్పుడు?

- ఇప్పటికే 30 శాతం మేర పూర్తయిన వరి కోతలు
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయిస్తూ నష్టపోతున్న వైనం
- రికార్డు స్థాయిలో వానాకాలం సాగు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకోగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. పంట చేతికొస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావం, తరువాత అధికవర్షాలు సాగుపై ప్రతికూలంగా మారినా చివరి నాటికి అంచనా మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.44లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 18 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందనే అంచనాతో అధికారులు 1291 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఇప్పటికే 30 శాతం వరకు కోతలు పూర్తికాగా కేంద్రాలకు ధాన్యంతో వచ్చిన రైతులు కొనుగోళ్లు ప్రారంభంకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణ పరిస్థితులు, మరోవైపు కదలని అధికారయంత్రాంగం తీరుతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,44,884 ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్‌లో 2.66లక్షలు, పెద్దపల్లిలో 2.01లక్షలు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 1.74లక్షల ఎకరాల్లో సాగైంది. గతంలో సింగిల్ విండో, ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేసేవారు. ఎన్నికల సమయం కావడంతో కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది.

కేంద్రాల్లో ధాన్యం కుప్పలు

ఇప్పటికే కోతలు ప్రారంభమై 20రోజులు కావస్తుండగా 25నుంచి 30శాతం పూర్తయ్యాయి. ఏ-గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం రూ.2203 మద్దతు ధర ప్రకటించింది. కానీ కోతలు పూర్తయి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇదే అదనుగా దళారులు ధాన్యం కొనుగోళ్లు చేపడతున్నారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ రైతుల కొనుగోలు కేంద్రాలపై లేదని రైతులు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో పరిస్థితిని పరిశీలించగా ఇప్పటికే రైతులు 30శాతం మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించినట్టు తెలిసింది. ఇదే పరిస్థితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కనిపిస్తోంది.

కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి - మాతంగి శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

వరికోతలు ప్రారంభమై 20రోజులు గడుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పోసి రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఒకవేళ వాతావరణం సహకరించకపోతే వర్షాలతో తమకు నష్టం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. దాంతో వారం రోజులుగా.. క్వింటల్ రూ.1900 చొప్పున దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారు.

**రైతులను పట్టించుకునే వారు లేదు
చిలుకూరి బాలయ్య, రైతు, తిమ్మాపూర్**

కోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి అక్కడే ఆరబోస్తూ పడిగాపులు కాస్తున్న. కొనుగోలు సెంటర్లను పట్టించుకునే అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ లేరు. వారికి ఎంతసేపు ఎలక్షన్లపైనే ప్రత్యేక శ్రద్ధ ఉంది. ఇప్పటికే దళారులు గ్రామంలో సగంకుపైగా ధాన్యాన్ని రూ.1900కే కొనుగోలు చేస్తూ సంచికిలా, మట్టికిలా అంటూ మోసం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు సెంటర్లు ఉంటయో.. ఉండవో.. అని దళారులకు వడ్లు అమ్ముతున్నం.

బిఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న హరిచంద్ తండా గిరిజన మహిళలు

ఎనిమిది నెలలుగా తండాలో నీళ్లు రావడం లేదు

- ఎన్నికలు రాగానే వచ్చారా అంటూ గిరిజన మహిళల ఆగ్రహం
- బిఆర్ఎస్ ప్రచారంలో నాయకులకు నిరసన సెగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం హరిచంద్ తండాలో బిఆర్ఎస్ నాయకులకు శుక్రవారం నిరసన సెగ తగిలింది.'ఎన్నికలు రాగానే తాండాకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, కానీ ఎనిమిది నెలల నుంచి తాగునీరు రాక తాము ఎంత ఘోష పడ్డా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రచారానికి వచ్చిన బిఆర్ఎస్ నాయకులను గిరిజన మహిళలు నిలదీశారు. మండలంలోని ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే మదన్ రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా రెడ్డి తునికి నల్ల పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రచారం ప్రారంభించారు. మొదటి రోజు తునికి, హరిచంద్ తాండ, ముబ్రాజ్ పల్లి, రాజిపేట్, వెంకటాపూర్, వెంకట్రావుపేట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో హరిచంద్ తండాలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో మహిళలు తాగునీటిపై వారిని ప్రశ్నించారు. తాగునీటి కోసం తమ సొంత డబ్బులతో బోర్ వేసుకున్నామని మూడవత్ రవి, మన్య, దేవి, లక్ష్మణ్, లచ్చ తెలిపారు. దీనిపై సునీత స్పందిస్తూ.. ఇక నుంచి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల లావాణి భూములను ప్రభుత్వం వచ్చాక పట్టాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాజు నాయక్, జడ్‌పిటిసి కవిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు చిలుముల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు గుంజరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టిఎస్‌పిఎస్‌సి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులు ఆ ప్రక్రియలో ఉంటారని తెలిపారు. డిసెంబర్ 15 నుంచి 23 వరకు తిరిగి డిపార్ట్‌మెంటల్ పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలను వాయిదా వేయడం పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టిజిజెఎల్‌ఎ-475) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ హర్షం ప్రకటించారు.

సుధాకర్ అడప చేతికి అరేబియా పత్రిక

హైదరాబాద్ : బియా బ్రాండ్ ఫౌండర్ సుధాకర్ అడప తాజాగా హలో ఇండో-అరేబియా సహా హలో అరేబియా పత్రికల హక్కులను పొందినట్లు ప్రకటించారు. ఈ జీవన శైలీ మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకోవడం ద్వారా మీడియా రంగంలోకి ప్రవేశించినట్లయ్యిందని ఆయన పేర్కొన్నారు. విదేశీ పబ్లిషింగ్ రంగంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా తాను గుర్తింపు పొందినట్లు తెలిపారు. హలో! ఇండో-అరేబియా, హలో! అరేబియా లాంటి రెండు లగ్జరీ, సెలబ్రిటీ మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రత్యేకమైన అవకాశాలు దక్కనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రేమజంట ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన చింతల సుమంత్ (20) దారగాని ఐశ్వర్య (17) గురువారం రాత్రి వైరా ప్రాజెక్ట్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వైరా ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరూ గత నెల 31వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయారు. ఇరువురి కుటుంబాలు వీరి కోసం ఎక్కడ గాలించినా ఆచూకీ లభించలేదు. దాంతో వారు బోనకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోనకల్ పోలీసులు వారి కోసం గాలిస్తున్న క్రమంలో యువ ప్రేమికులు వైరా ప్రాజెక్ట్ సమీపాన ఉరి వేసుకుని చనిపోయిన ఘటన మార్నింగ్ వాకర్స్‌కు, రైతులకు కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ.. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం మధిరకు తరలించారు.

ఐలమ్మ స్ఫూర్తితో ప్రభుత్వాల మెడలు వంచాలి

- ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి
- మహిళా కార్మికుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి రూ.600 కూలి, 200 రోజుల పనిదినాలు సాధించాలని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఐలమ్మ నగర్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా కార్మికుల రాష్ట్ర సదస్సును నాయకులు స్వరూప అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సదస్సుకు ముందుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బప్పని పద్మ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఛాయ చిత్రానికి పూలు చల్లి నివాళు లర్పించారు.

అనంతరం జరిగిన సదస్సులో పుణ్యవతి మాట్లాడుతూ పాలకుర్తిలో రామచంద్రారెడ్డి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ వారసులుగా.. కూలి కోసం, పనిదినాల కోసం పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ, సిఎం కెసిఆర్ దొంగ నాటకాలాడుతూ కార్మికులు, కూలీల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. డ్వాక్రా గ్రూపులకు పావలా వడ్డీకి రుణాలిస్తామన్న ప్రభుత్వాలు రూ.2ల వడ్డీకి ఇస్తూ మహిళలను మోసం చేస్తున్నారన్నారు. మనకివ్వడానికి సర్కార్ వద్ద డబ్బులు లేవంటున్న

ముఖ్యమంత్రి హైదరా బాద్‌లో ఉన్న సచివాలయం కూలగొట్టి కొత్త సచివాలయం కట్టించారని ఆరోపించారు. హక్కుల సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని కోరారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు టి జ్యోతి మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వంలో జరుగుతున్న భూ పోరాటాల్లో మహిళా కార్మికులే అధికంగా పాల్గొంటున్నారన్నారు. 60 గజాల స్థలం కోసం పోరాడే మహిళలది ఆత్మగౌరవ పోరాటమన్నారు. ఒక ఎకరం భూమి సాగు చేయడానికి 52 మంది కార్మికులు అవసరమని ఒక అధ్యయనం తెలిపిందని, కానీ ప్రస్తుతం 16 మంది కార్మికులే మాత్రమే పనిచేస్తున్నారని, వారందరూ మహిళలే కావడం విశేషమన్నారు. ఎకరానికి 36 మందికేనా పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా పెరిగాయని, దాంతో సామాన్యులు సరుకులు కొనలేక పస్తులుండాల్సి వస్తుందని తెలిపారు. గూడు కావాలని మీరు చేస్తున్న ఈ పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు ఉంటుందని, మీ పోరాటం జయప్రదం కావాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, హన్మకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సారంపల్లి వాసుదేవరెడ్డి, గుమ్మడిరాజుల రాములు, డి తిరుపతి, పుల్లా అశోక్ పాల్గొన్నారు.

కాళేశ్వరం వాస్తవాలు బయటపెట్టాలి

- లేదంటే మేమే బయటపెడతాం
- అధికార దుర్వినియోగానికి ప్రాజెక్టే సాక్ష్యం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వాస్తవాలను ప్రజల ముందు ప్రవేశపెట్టాలని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. లేదంటే మేమే బయటపెడతామని హెచ్చరించారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో "కుంగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు.. పరిష్కార మార్గాలు ఏమిటి ?" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో రాజకీయ నాయకులు, రిటైర్డ్ ఇంజనీర్లు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా టిజెఎఫ్ అధ్యక్షులు కోదండరాం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు డ్యామ్ సేఫ్టీ రిపోర్ట్ బయట పెట్టాలని కోరారు. ప్రాజెక్టు అద్భుతాలపై రాష్ట్ర ప్రభుత్వం తన ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ముఖ్యమంత్రే అన్నీ పనులు చేస్తానంటే ఎలాగని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నదిపై అధ్యయనం చేయకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం సరికాదన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లపై ఆధారపడి కట్టిన ప్రాజెక్టు కుంగిపోవడంపై ఇప్పుడు బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. కాళేశ్వరం అంతర్జాతీయ టూరిజం కోసమే కట్టారని గుర్తుచేశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ నర్సింహారావు మాట్లాడుతూ మేడిగడ్డ చాలా క్లిష్టమైన ప్రాజెక్టు అని చెప్పారు. బ్యారేజీలు కేవలం ఐదు టిఎంసిల వరకే నిర్మిస్తారని, డెల్టా ప్రాంతంలోనే వీటిని కడతారని చెప్పారు. మేడిగడ్డను స్టోరేజ్ చేయని పక్షంలో ఎప్పుడూ ఫ్లష్ చేస్తూ ఉండాలని చెప్పారు. సీనియర్ జర్నలిస్టు విజయసారథి రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు సర్వేనే సరిగ్గా చేయలేదన్నారు. తప్పు ఉంటే రీ సర్వే చేయాలని గుర్తుచేశారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు పక్కనపెట్టి కాళేశ్వరం కట్టారని ప్రశ్నించారు. రిటైర్డ్ ఇంజనీర్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు రికార్డులను సీజ్ చేయాలని, బాధ్యులైన ఇంజనీర్లు, అధికారులను జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. రాఫ్ట్ పిల్లర్ల కింద ఇసుక కొట్టుకు పోవడంతోనే మేడిగడ్డ కుంగుబాటుకు గురైందన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును మళ్లీ నిర్మించాలని కోరారు. లక్ష యాభై వేల కోట్ల నిధులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రౌండ్ టేబుల్‌కు అధ్యయన వేదిక అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి సాధిక్ సమన్వయం చేశారు.

పోలీసులు బిఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారు

- వారిపై చర్యలు తీసుకోండి
- ఇసికి జూపల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొల్లాపూర్ నియోజకవర్గంలో కొందరు పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, వారిని తక్షణమే బదిలీ చేయాలని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను శుక్రవారం కలిసిన జూపల్లి.. పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొల్లాపూర్‌లో చాలా మంది పోలీసులు దీర్ఘకాలంగా ఒకే చోట ఉన్నారని, వారిని వెంటనే బదిలీ చేయాలని జూపల్లి విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ నేతలు చెబుతున్నట్లే పోలీసులు, అధికారులు నడుచుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదు చేస్తే తిరిగి తమపైనే కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజక వర్గంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగే పరిస్థితులు లేవన్నారు. అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసులను వెంటనే బదిలీ చేయాలని కోరారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్

ఎంఐఎంకు ఓటమి తప్పదు

- మజ్లిస్, బిజెపి, బిఆర్ఎస్ ఫిక్సింగ్
- నాంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్ ఖాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాద ఎంఐఎంకు ఈ సారి ఓటమి తప్పదని నాంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. ఎంఐఎం అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని విమర్శించారు. నియోజకవర్గంలో 90 వేల బోగస్ ఓట్లున్నట్టు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే వాటిలో 40 వేల ఓట్లు తొలగించారనీ, ఇంకా 50 వేల బోగస్ ఓట్లు ఉన్నాయని తెలిపారు. ప్రతిసారి ఎంఐఎం బోగస్ ఓట్లతో గెలుస్తుందని, ఈ సారి అలాంటి పప్పులేవి ఉడకవని హెచ్చరించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా బోగస్ ఓట్లు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఆరున నామినేషన్ దాఖలు చేస్తామని, మతం ఆధారంగా చేసే విద్వేష రాజకీయాల కాలం చెల్లిందని హెచ్చరించారు. మతోన్మాద నాంపల్లిగా మార్చిన ఎంఐఎం చేతుల నుంచి తిరిగి సెక్యులర్ నాంపల్లిగా మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మిమిక్రీ అశోక్ కుమార్ రచించి, స్వరపరిచిన ఫిరోజ్ భాయ్ ప్రచార గీతాన్ని విడుదల చేశారు. సమావేశంలో ఫిరోజ్ ఖాన్ సతీమణి లైలాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వద్దని వెళ్లగొట్టినా బుద్ధి రాలేదు

- ఖమ్మం, పాలేరు ప్రజలు వెళ్లగొడితే పొర్లు దండాలు పెడుతూ తిరుగుతున్నావ్
- తుమ్మలపై పువ్వాడ ధ్వజం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నిన్ను ఖమ్మం, పాలేరు ప్రజలు వద్దని ఇంటికి పంపించినా ఇంకా ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ప్రజలకు పొర్లు దండాలు పెడుతూ తిరుగుతున్నారో అర్థం కావట్లేదు' అని ఖమ్మం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్.. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుపై ధ్వజమెత్తారు. ఖమ్మం నగరం 24వ డివిజన్ శాంతినగర్‌లో ప్రభుత్వ పూర్వ ఉద్యోగి నరసింహారావు కుమార్తె నిరోషా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ మాట్లాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న మీరు ప్రజలకు ఏం చేశారని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మలను ప్రశ్నించారు. ఒకవేళ చేసి ఉంటే ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారని నిలదీశారు. ఇక్కడ మీరు చేసింది ఏమీ లేదని, కేవలం అధికారాన్ని అనుభవించి ప్రజలను బూతుపురాణంతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. సత్తుపల్లి, పాలేరుల్లో గెలిచి మంత్రిగా ఉన్నపుడు ఆయా నియోజకవర్గాలకు ఏం చేశారని నిలదీశారు. ఖమ్మంకు ఏం చేశారో చెప్పాలన్నారు. 40 ఏండ్ల అనుభవం అని చెప్పుకుంటూ ఒక్క అవకాశం ఇవ్వండని పొర్లుదండాలు పెట్టడం చూస్తే అధికార దాహం తప్ప మరేం కనిపించడం లేదన్నారు. తనపై పోటీ చేసి ఓడిపోయిన వాడిని కేసీఆర్ పిలిచి మంత్రి పదవి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేని చేస్తే అదే కేసీఆర్‌ను దూషిస్తున్న అవకాశవాది అని విమర్శించారు. రాజకీయంగా ఆయనకు ఎలాంటి అవకాశం లేకున్నా ఇంత మంచి అవకాశం ఇచ్చి జిల్లాలో ఏకఛత్రాధిపత్యం ఇస్తే నువ్వేం చేశావ్ అని, పార్టీకి వెన్నుపోటు పొడిచి పోవడం తప్ప అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మెన్ కూరాకుల నాగభూషణం, భద్రాద్రి బ్యాంక్ చైర్మెన్ చెరుకూరి కృష్ణమూర్తి, వర్తక సంఘం అధ్యక్షకార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, వేములపల్లి వెంకన్న, కార్పొరేటర్ మగ్బూల్, ఎన్నికల సమన్వయకర్త, సభ్యులు పల్లా రాజశేఖర్, పారా నాగేశ్వరరావు, అమరగాని వెంకన్న, అరుణ, మాధవి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

యువజన సమస్యలపై సమరశీల పోరాటాలు

డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డివైఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న కోట రమేష్

యువజన సమస్యలపై సమరశీల పోరాటాలను నిర్మిస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్య దర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ అన్నారు. డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కోట రమేష్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1980, నవంబర్ ఒకటి, రెండు, మూడు తేదీల్లో డివైఎఫ్ఐ ఆవిర్భవించిందని చెప్పారు. జాతీయోద్యమ స్ఫూర్తితో, సామ్రా జ్యవాదానికి వ్యతిరేకంగా దేశభక్తి, యువత ఆలోచనలతో ఏర్పడిందన్నారు. ఈ సంఘం యువజన సమస్యలపై దేశవ్యాప్తంగా అనేక సమరశీల పోరాటాలను నిర్వహించిందని అన్నారు. ఎంతో మంది యువజన ఉద్యమ నాయకులు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు. 'అందరికీ విద్య-అందరికీ ఉపాధి' అనే నినాదంతో గత 43 ఏండ్లుగా దేశంలో యువజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదని చెప్పారు. దేశంలో నిరుద్యోగ సమస్యలపై, ఉపాధి, నియామకాల కోసం నిరంతరం పోరాటాలను నిర్వహిస్తున్నదని అన్నారు. వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రానున్న కాలంలో మరిన్ని పోరాటాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల గడ్డ హుస్నాబాద్

- ఇందుర్తిలో సిపిఐ, కాంగ్రెస్‌కు సమభాగం
- పునర్విభజనలో బిఆర్ఎస్‌కే మొగ్గు
- యువత, మహిళ ఓట్లు కీలకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యమాలకు మారుపేరుగా హుస్నాబాద్ గడ్డ ఊపిరి పోసుకున్నది. పేదల కోసం కమ్యూనిస్టులు ఉద్యమాలు చేసిన చరిత్ర హుస్నాబాద్ ప్రాంతానిది. నైజాంకు వ్యతిరేకంగా ఉద్యమానికి నాయకత్వం వహించడం, నాడు సాయుధ పోరాటంలో పోరాడి అమరులయ్యాయిన వారు ఎందరో ఉన్నారు. అలాంటి చైతన్యం కలిగిన ఈ ప్రాంతం ఆదినుంచి కూడా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నది. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ తన ఎన్నికల ప్రచార ప్రస్థానాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించి విజయ దుందుభి మోగించారు.

రెండోసారి కూడా అదే ఫార్ములాతో ప్రచారం ప్రారంభించి మరోమారు గులాబీ జెండా ఎగుర వేశారు. ఇప్పుడు మూడోసారీ అదే సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు. దాంతో రాజకీయ రంగంలో హుస్నాబాద్‌కు ఓ ప్రత్యేకత సంతరించుకున్నది.

మొట్టమొదట హుస్నాబాద్ నుస్తులాపూర్‌లో...

హుస్నాబాద్ నియోజకవర్గం మొట్టమొదట



1952లో నుస్తులాపూర్‌గా నియోజకవర్గంగా ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో హుస్నాబాద్, బెజ్జంకి, మానకొండూర్, నుస్తులాపూర్ మండలాలు న్నాయి. 1957లో నియోజకవర్గ పునర్విభజనలో ఇందుర్తి నియోజకవర్గం ఏర్పాటు చేశారు. ఉమ్మడి హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, చిగురు మామిడి మండలాలతో ఇందుర్తి నియోజకవర్గం ఏర్పడింది. 2009లో మరోకసారి నియోజకవర్గ పునర్విభజన చేశారు. పునర్విభజనలో ఇందుర్తి నియోజకవర్గం లోని బెజ్జంకి మండలాన్ని మానకొండూరులో కలిపారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను ఇందుర్తి నియోజకవర్గం లోని ఉమ్మడి హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి మండలాలతో హుస్నాబాద్ నియోజకవర్గం 2009లో ఏర్పడింది.

ఇందుర్తిలో సిపిఐ, కాంగ్రెస్‌కు సమభాగం

నియోజకవర్గాల పునర్విభజన, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో హుస్నాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టారు.

15 సార్లు ఎన్నికలు జరగగా పునర్విభజనకు ముందు ఇందుర్తి నియోజకవర్గంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ ఉండేది. కాంగ్రెస్ ఐదు సార్లు, సిపిఐ ఆరు సార్లు విజయం సాధించింది.

ఇందుర్తి నియోజకవర్గం ప్రజలు సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులకు సమభాగంగా విజయాన్ని అందించారు. 2009లో హుస్నాబాద్ నియోజకవర్గ ఏర్పడినప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రవీణ్ రెడ్డి గెలుపొందగా తెలంగాణ ఉద్యమం నుంచి టిఆర్ఎస్ అభ్యర్థికే ప్రజలు పట్టం కట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ రెండో సారి గెలవడంతో హుస్నాబాద్‌లో కమ్యూనిస్టుల ప్రభావం తగ్గింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య గట్టి పోటీ ఉంటుంది. కాగా, హుస్నాబాద్‌లో యువత, మహిళల ఓట్లు కీలకంగా మారనుంది. నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని గెలిపించి హ్యాట్రిక్ ఇస్తారా.. లేదా కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారా వేచి చూడాల్సిందే.